సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 13 । జనవరి । 2023



క్రీడలతో ఉత్సాహం.. ఉత్తేజం

క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉల్లాసం, ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. –IIలో..



త్వరలో అందుబాటులోకి నేచురల్ గ్యాస్

కడపలో ఏర్పాటు చేసిన మొదటి లిక్విఫైడ్ అండ్ కంప్రెష్డ్ నేచురల్ గ్యాస్ స్టేషన్‌ను డిప్యూటీ సీఎం, కడప ఎంపీ ప్రారంభించారు. –IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.8/12.9

జిల్లాలో గురువారం 12.9 – 30.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. –కడప అగ్రికల్చర్

అన్నదాతకు వెన్నుదన్ను

- పెట్టుబడి అవసరాలకు అనుగుణంగా రుణాలు
- 10 శాతం మేర పెరిగిన రుణ పరిమితి
- ప్రభుత్వ నిర్ణయంపై అన్నదాతల్లో ఆనందం

2018 నుంచి ఇచ్చిన పంట రుణాలు (రూ.కోట్లలో)

ఏడాది	లక్ష్యం	మంజూరు	శాతం
2018–19	3841	4826	125
2019–20	4800	5600	116
2020–21	5500	5354	97
2021–22	6600	8082	122
2022–23	4541	3196	70



భారీ రుణాలు లక్ష్యం..

వైఎస్సార్ జిల్లాకు సంబంధించి వ్యవసాయానికి 2022–23 ఆర్థిక సంవత్సరానికి రైతాంగానికి భారీగా రుణాలు అందించేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ రుణాల కింద రూ. 4541.85 కోట్ల రుణాలను అందించాలని నిర్ణయించారు. అయితే డిసెంబర్ చివరి నాటికి 3196.12 కోట్ల మేర రుణాలను అందించారు. ఇందులో ఖరీఫ్ సీజన్ కింద పంటలను సాగు చేసే 2,78,542 మంది రైతులకు గాను రూ. 2679.69 కోట్లకుగాను రూ. 2790.97 కోట్ల రుణాలను మంజూరు చేశారు. అలాగే రబీ కింద పంటలు సాగు చేసే 17856 మంది రైతులకు రూ. 1862.16 కోట్లకు గాను డిసెంబర్ చివరి నాటికి రూ. 405.15 కోట్ల మేర రుణాలను మంజూరు చేశారు.

కడప అగ్రికల్చర్: అన్నదాత సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారి అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ అన్ని విధాలా అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని పండగ చేస్తోంది. పెట్టుబడి అవసరాలకు అనుగుణంగా రైతుల రుణ పరిమితిని పెంచింది. అన్ని రంగాల మాదిరిగా వ్యవసాయ రంగానికి సంబంధించిన అవసరాల ధరలు పెరిగాయి. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులతోపాటు కూలీలు తదితర ఖర్చులు ఏటేటా పెరుగుతున్నాయి. దీంతో పంటల సాగుకు పెట్టుబడి అధికమైంది. ఫలితంగా అన్నదాతలు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దీనిని గమనించిన ప్రభుత్వం రైతులకు పెరుగుతున్న వ్యయానికి అనుగుణంగా పంట రుణాల పరిమితి పెంచి రుణాలను అందించనుంది. దీంతో అన్నదాతలు పెట్టుబడి సాయానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా పోయింది.

2023–24కు పెరిగిన రుణ పరిమితి..

రైతు రుణ పరిమితి పెంపునకు సంబంధించి విధివిధానాలను బ్యాంకు అధికారులతోపాటు వ్యవసాయ అధికారులు రూపొందించారు. పంటల సాగు, విస్తీర్ణం, రైతులు తదితర వివరాలను సేకరించారు. ఇటీవల కడప డీసీసీ బ్యాంకులో జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ(డీఎల్‌టీసీ) సమావేశాన్ని ఏర్పాటు చేసి వ్యవసాయ, వాటి అనుబంధ జిల్లా అధికారులు చర్చించి సాగులో పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రుణ పరిమితి పెంపును ఆమోదించారు. పంట పెట్టుబడి అవసరాలకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితి పెంచారు. జిల్లాలో వరితోపాటు అన్ని రకాల వ్యవసాయ, వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలకు 2023–24కు రుణ పరిమితిని పెంచారు. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది నుంచి ఎకరా పంటకు ఇవ్వనున్న రుణాలు

పంట	గతేడాది గరిష్టంగా ఇచ్చిన రుణాలు (రూ.లలో)	ఈ ఏడాది ఇవ్వనున్న గరిష్ట రుణ పరిమితి (రూ..లలో)
వరి(ఖరీఫ్)	38000	40000
వరి(రబీ)	40000	41000
వేరుశనగ(ఖరీఫ్)	26000	29000
వేరుశనగ (రబీ)	32000	34000
పత్తి (ఖరీఫ్)	38000	41000
పత్తి (రబీ)	40000	42000
ఉల్లి	40000	48000
పసుపు	88000	10000
శనగపంట(ఖరీఫ్)	30000	35000
అరటి	104500	120000
బొప్పాయి	71500	75000
మామిడి	38500	40000
మల్లెతోట	45000	50000
చామంతి	45000	46000

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రస్తుతం ప్రతి దానికి ధరలు పెరిగాయి. ఏ పంట సాగు చేయాలన్నా పెట్టుబడి ఖర్చు బాగా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతు కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం రుణపరిమితి పెంచడం హర్షణీయం. రుణ పరిమితి పెరగడంతో కొంత ఉపశమనం వస్తుంది. – రవిశంకర్‌రెడ్డి, రైతు, టంగుటూరు, రాజుపాలెం మండలం

కిందిస్థాయిలో చర్చించే..



రైతులకు పంటల సాగుకు ఎంత ఖర్చు అవుతుందనే విషయాన్ని కిందిస్థాయిలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆయా పంటల సాగును బట్టి రుణాల పరిమితిని పెంచాము. ఈ పెంచిన రుణం 2023–24 ఆర్థిక సంవత్సరం నుంచి అమలవుతుంది. పంటలు సాగు చేసే ప్రతి రైతు కచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి. – అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఎక్కువ రుణాలకు అవకాశం



ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో బ్యాంకర్లు ఎక్కువ రుణాలను ఇచ్చే అవకాశం ఉంది. పెంచిన రుణంతో రైతులకు పెట్టుబడి ఇబ్బందులు తొలగుతాయి. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలను చెల్లిస్తే వడ్డీ రాయితీ కూడా పొందే అవకాశం ఉంటుంది. – సద్దల దుర్గా ప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, వైఎస్సార్ జిల్లా

తెల్లబోయిన పల్లె



రైతు నాగ సుబ్బారెడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- పొలం పక్కన అన్నం తింటున్న రైతులపైకి దూసుకొచ్చిన టిప్పర్
- ఇద్దరు రైతులు సహా టిప్పర్ డ్రైవర్ దుర్మరణం
- మూడు కుటుంబాల్లో విషాదం

జమ్మలమడుగు రూరల్: పొలం పనుల పొట్ట కూటి కోసం పొలం పనికి వెళ్లిన ఇరువురు అన్నదాతలను అకాల మృత్యువు ప్రమాద రూపంలో కబళించింది. పొలంలో పనిచేసి అలసి.. ఆకలి తీర్చుకునేందుకు భోజనానికి సిద్ధమైన వారిపైకి ఉన్నట్లుండి టిప్పర్ దూసుకురావడంతో ఇద్దరు అన్నదాతలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటనలో టిప్పర్ డ్రైవర్ కూడా మృతి చెందాడు. రైతులు అన్నం తింటున్న తెల్లెతోపాటు చెల్లాచెదురుగా పడిన శరీర అవయవాలతో ఆ ప్రదేశం రక్తసిక్తమైంది. ఒక రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ హృదయ విదారక సంఘటన జమ్మలమడుగు– ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై ధర్మాపురం సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకొంది.

ఎద్దులతోనే జీవనం సాగిస్తూ..

మృతుల్లో ఒకరైన ఎనగలూరు ఓబులేసుది జమ్మలమడుగు మండలం గొరిగెనూరు గ్రామం. వ్యవసాయ కూలీ. కుటుంబ పోషణ కోసం తనకున్న కాడెద్దులతో రైతుల పొలాలకు సేద్యానికి వెళుతుంటాడు. గురువారం ధర్మాపురానికి చెందిన రైతు యనమల నాగ సుబ్బారెడ్డి వరి పొలంలో సేద్యం చేసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో రోడ్డు వారన అన్నం తింటుండగా ఉన్నట్లుండి టిప్పర్ మృత్యు శకటంలా దూసుకురావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ యాజమాని ఆకస్మిక మరణంతో ఆ ఇంట రోదనలు మిన్నంటాయి.

నేల తల్లి ఒడిలోనే..

జమ్మలమడుగు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన యనమల నాగ సుబ్బారెడ్డికి భార్య ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. 60 ఏళ్ల వయసులోనూ తనకున్న 6 ఎకరాల పొలంలో వరి పంట పండిస్తున్నాడు. ఈ ప్రమాదంలో దుర్మరణం చెందాడు. తన పక్కనే కొడుకు, మనవడు ఉన్నప్పటికీ వారు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే నాగ సుబ్బారెడ్డి మరణ వార్త విని ధర్మాపురం గ్రామం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

ఇద్దరి మృతికి కారణమై..

ఇద్దరి మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్ విజయకుమార్ జీవితం కూడా విషాదంగా ముగిసింది. జమ్మలమడుగు మండలం ఎస్. ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఇతను ఇటీవల కొంత కాలంగా దేవగుడికి చెందిన టిప్పర్‌కు డ్రైవర్‌గా వెళుతున్నాడు. ఈ క్రమంలో జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళుతూ మార్గమధ్యంలో వాహనాన్ని పొలంలోకి తీసకెళ్లాడు. గుండెపోటుకు గురయ్యాడా.. లేక మూర్ఛ వచ్చిందా.. నిద్రమత్తా.. నిర్లక్ష్యమా.. అనారోగ్యమా.. కారణం తెలియదు గానీ తాను నడుపుతున్న వాహనం అదుపుతప్పడంతో ఇద్దరు రైతులతో పాటు తను కూడా మృతి చెందాడు. విజయకుమార్‌కు భార్య ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఇతని అకాల మరణంతో ఎస్. ఉప్పలపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

న్యూస్‌రీల్

రాజంపేట సబ్‌కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



రాజంపేట: రాజంపేట సబ్‌కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేస్తున్న కోదండరామిరెడ్డిని ప్రభుత్వ పరిపాలన విభాగంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశిస్తూ ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను విడుదల చేసింది.

కడప ఆర్జేడీగా బి.ప్రతాప్‌రెడ్డి

సాక్షి, కడప ప్రతినిధి: స్కూల్ ఎడ్యుకేషన్ కడప రీజియన్ ఆర్జేడీ(ఫుల్ అడిషనల్ చార్జ్)గా బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఆర్జేడీగా పనిచేస్తున్న ఎం.వెంకట కృష్ణారెడ్డిని ఏపీ మోడల్ స్కూల్స్ జేడీగా బదిలీ చేశారు. ప్రస్తుతం బి.ప్రతాప్‌రెడ్డి ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌గా ఉన్నారు.

ముగిసిన సబ్జెక్టు టీచర్ల సర్దుబాటు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేసేందుకు అర్హత కలిగిన ఎస్‌జీటీలకు గురువారం డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈఓ దేవరాజు, ఏడీ మునీర్‌ఖాన్, సీకేదిన్నె, వీఎన్‌పల్లె ఎంఈఓలు పాల్గొన్నారు. ఇందులో ఇంగ్లిష్ సబ్జెక్టుకు 171 మంది, ఉర్దూ మ్యాథ్స్‌కు 20 మంది, ఉర్దూ బయలాజికల్ సైన్సుకు ఏడుగురు, ఉర్దూ ఫిజికల్‌సైన్సుకు ఏడుగురు, మ్యాథ్స్‌కు 113 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించే వరకు సబ్జెక్టు బోధన చేస్తారు. ఇందుకు వీరికి నెలకు రూ. 2500 చొప్పున సబ్జెక్టు అలవెన్స్‌ను ప్రభుత్వం చెల్లించనుంది.

శాస్త్రీయపద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకం

రాజంపేట : శాస్త్రీయపద్ధతిలో గొర్రెలు, మేకలు పెంపకం చేపడితే అధిక లాభాలు వస్తాయని రాజంపేట పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా.ప్రతాప్ అన్నారు. గురువారం నంద్యాల, ప్యాపిలికి చెందిన గొర్రెల పెంపకందార్లు క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వ్యాధి నివారణ టీకాలుతో నట్టల నివారణ మందులను గొర్రెలకు వాడినట్లయితే పెద్దజీవాలు చనిపోవన్నారు. గొర్రె, మేక పిల్లల్లో మరణాలు తగ్గినప్పుడే గొర్రెల పెంపకందారునికి ఆదాయమన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు శరత్‌కుమార్‌రెడ్డి, భాగ్యవతి, శ్రీనివాస్‌రెడ్డి, గొర్రెల పెంపకందారుల శిక్షణా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అనీమియా రహిత జిల్లాగా నిలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ రామరాజు

కడప సిటీ: సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్యసాధనతోపాటు రాష్ట్రంలో జిల్లాను అనీమియా (రక్త హీనత) రహిత జిల్లాగా రూపుదిద్దేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయ రామరాజు అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ సాయి కాంత్ వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార పంపిణీలో కీలకంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టడంలో ఐసీడీఎస్ అధికారులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. ముఖ ఆధారిత హాజరు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాధాన్యత రంగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనుల లక్ష్యాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సభా భవనంలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఆర్డీఓలు, నియోజకవర్గ మండల, ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశానికి జేసీ సాయికాంత్‌వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రూపుదిద్దుకుంటున్న జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే తప్పుడు కథనాలు

- టీడీపీ నాయకుడు ఫిర్యాదు చేస్తే ఎల్లోమీడియా భుజానికి ఎత్తుకుంది
- మా గ్రామాల్లోనివారు ఒక్కరైనా ఫిర్యాదు చేశారా?
- స్కూలు కూడా నా స్వంత ఖర్చులతో నిర్వహిస్తున్నాను
- నా స్వంత ఇల్లు, ఎస్టేట్ అన్నీ సమాజ సేవ కోసమే
- వారు చెప్పిన సర్వే నంబర్లలోని భూములు మా ఆధీనంలో లేవు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ దురుద్దేశంతోనే ఎల్లో మీడియా తప్పుడు కథనాలు ప్రచురించిందని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వకాలం నుంచి తమది పెద్ద వ్యవసాయ కుటుంబమని, తమ తాతగారి హయాం నుంచి చుట్టూ ఉన్న పది గ్రామాలను ఆదరిస్తూ సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. తనకు గ్రామీణ వాతావరణం అంటే ఇష్టమైనందునే ఆకేపాడులో ఇల్లు కూడా నిర్మించుకున్నానన్నారు. తమ ఎస్టేట్ చుట్టూ ఆరు గ్రామాలున్నాయని, ఈ గ్రామాల్లోని వారు ఏ ఒక్కరు ఫిర్యాదు చేసినా ఆ భూమి వారికే రాయించి ఇస్తానన్నారు. ఆకేపాడు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన ఏ ఒక్కరు భూమి కోల్పోయినట్లు ఫిర్యాదు చేయలేదు. కానీ ఎక్కడో 20కిలోమీటర్ల దూరంలో ఉండే టీడీపీ నాయకుడు సుబ్రమణ్యంనాయుడు 'స్పందన'లో ఫిర్యాదు చేస్తే ఎల్లో మీడియా భుజానికి ఎత్తుకుందని మండిపడ్డారు. సర్వేనంబర్ 739, 1041లో తమ భూములు లేవన్నారు. సర్వే నంబర్లు 556/1, 556/2 లలో భూములు ఉన్నట్లు రాశారని..వాస్తవానికి 556 సర్వేనంబర్ ఇంకా సబ్ డివిజన్ కాలేదన్నారు. తమది ఉమ్మడి కుటుంబమని, ఎక్కడెక్కడ ఏఏ సర్వేనంబర్లలో భూములు ఉన్నాయో తనకు తెలియదన్నారు. సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక విషయాలపైనే తనకు మక్కువని వివరించారు. ఇరవై ఏళ్ల క్రితం తాను గుడి నిర్మించేటప్పుడు ఆ ప్రాంతమంతా అడవిగా ఉండేదని.. ప్రస్తుతం అక్కడ వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా గుడులు నిర్మించామన్నారు. ఆ గుళ్లలో ధూప, దీప నైవేద్యాన్నింటికీ ఖర్చు తానే భరిస్తున్నానన్నారు. నిత్యం అన్నదానం నిర్వహిస్తూ ప్రతి ఏటా వందల పెళ్లిళ్లు నిర్వహిస్తుంటానన్నారు. తన ఇల్లు కూడా సమాజ సేవకే అంకితమని, రూ.50లక్షలు విలువజేసే ఆ ఇంటిలో వృద్ధాశ్రమం పెట్టే యోచన ఉందన్నారు. తమ స్వంత స్థలం సర్వే నంబర్ 26/1బీలో టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మిస్తున్నామని, అలాగే 68/1ఏలో రూ.3.50కోట్లతో వ్యవసాయ గోడౌన్‌కు టెండర్లు పూర్తయ్యాయన్నారు. అదే సర్వేనంబర్‌లో కంటి ఆస్పత్రి నిర్మించేందుకు రోటరీ క్లబ్‌కు ఎకరా భూమి అప్పగించామని, శ్మశానానికి కూడా ఎస్టేట్‌లోనే భూమి ఇచ్చామని ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆకేపాడు తనకు జన్మనిచ్చిన ప్రదేశమని, దాని రుణం తీర్చుకునేందుకు తాను ప్రయత్నిస్తున్నానన్నారు.

సేవాదృక్పథంతోనే పాఠశాల నిర్వహణ

జన్మనిచ్చిన పల్లెలోనే సరైన వసతులు లేకపోవడంతో 30 ఏళ్లక్రితం అక్కడ స్వంత ఖర్చులతో స్కూలు నిర్మించానన్నారు. ఐదుగురు నిరుద్యోగులకు అప్పగించి ప్రతినెలా జీతాల కోసమే రూ.50వేలు ఇస్తున్నానన్నారు. పాఠశాల నిర్వహణకు ఎవరు ముందుకొచ్చినా ఫ్రీగా ఇచ్చేస్తానన్నారు. హార్స్ రైడింగ్, స్విమ్మింగ్ అంటే తనకు ఇష్టమని.. ఆరోగ్యం కోసం అలా చేస్తుంటానని తెలిపారు. గ్రామంలో ఉన్న తన ఇల్లు, భూములు భవిష్యత్‌లో ట్రస్టుకు ఇవ్వాలనే యోచనలో అన్నదమ్ములం ఉన్నామని ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆకేపాడును మండల కేంద్రంగా ప్రకటిస్తే మరో 10 ఎకరాలు స్వంత స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ కూడా పాల్గొన్నారు.

కొనుగోళ్ల జోరు..

- సంక్రాంతి నేపథ్యంలో కిటకిటలాడుతున్న దుకాణాలు
- వస్త్రాలు, నిత్యావసరాలకు పెరిగిన గిరాకీ



వైవీ స్ట్రీట్‌లో ప్రజల రద్దీ

కడప కల్చరల్: మార్కెట్లలో సంక్రాంతి సందడి నెలకొంది. వ్యాపారాలతో బజార్లన్నీ కళకళలాడుతున్నాయి. ప్రధాన మార్కెట్లలో అడుగు తీసి అడుగు వేసేందుకే కష్టంగా ఉంది. గురువారం నుంచి జిల్లాలోని అన్ని ప్రధాన మార్కెట్లు ప్రజలతో రద్దీగా మారాయి. పండుగకు ఒకరోజు మాత్రమే మిగిలి ఉండడంతో ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది. దీంతో మార్కెట్లన్నీ రద్దీగా మారాయి. ప్రధానంగా వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఎక్కువగా మహిళలే దుకాణాల్లో కనిపించారు. ఆ తర్వాత రెడీమేడ్ దుకాణాలు రద్దీగా మారాయి. సంక్రాంతి పండుగ ప్రత్యేకమైన సంప్రదాయాలతో కూడినది గనుక దానికి సంబంధించిన సామగ్రిని తెచ్చుకునేందుకు ప్రజలు దుకాణాల వద్ద గుమికూడారు. ప్రధానంగా అలసందలు, నూనెల ధరలు కొండెక్కి కూర్చొన్నాయి. దాదాపు అన్ని వస్తువుల ధరలు అధికంగా ఉన్నా కొనక తప్పని స్థితి గనుక జనం దుకాణాల వద్ద సందడి చేశారు. తెలుగునాట వచ్చే పెద్ద పండుగ గనుక పిల్లలు, మహిళలు, పెద్దలు అందరిలోనూ పండుగ ఉత్సాహం కనిపిస్తోంది. సంవత్సరానికి వచ్చే పండుగ గనుక ఇంటికి కావాల్సిన దాదాపు అన్ని వస్తువులు కొంటున్నారు. పాదరక్షల దుకాణాలు కూడా జనంతో కళకళలాడుతున్నాయి. ఫ్యాన్సీ దుకాణాలలో కూడా మహిళలు పెద్ద ఎత్తున కనిపిస్తున్నారు. వన్ గ్రామ్ గోల్డ్ కొనేందుకు మొగ్గుచూపారు. ఈ సందర్భంగా వస్త్రాలు, నిత్యావసర సరుకుల దుకాణాల తర్వాత ఫ్యాన్సీ వస్తువులే ఎక్కువగా కొనుగోలు జరిగాయి. రెండవరోజు పెద్దల పండుగ గనుక పూజా సామగ్రికి అధిక డిమాండ్ ఏర్పడింది. కొబ్బరికాయల ధరలు కూడా బాగా పెరిగాయి. చివరిరోజున కనుమ పండుగ కోసం నాటుకోళ్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఒక్కొక్క కోడి బరువును బట్టి రూ. 600–800 వరకు విక్రయిస్తున్నారు. పండుగ కొనుగోళ్ల సందర్భంగా జిల్లా అంతటా ప్రధాన మార్కెట్లలో జనం కిటకిటలాడారు.



వస్త్ర దుకాణంలో మహిళల కొనుగోళ్లు

నగరంలో

కడప నగరంలోని ప్రధాన మార్కెట్ వైవీ స్ట్రీట్, బీకేఎం స్ట్రీట్, వన్‌టౌన్ సర్కిల్ నుంచి గోకుల్ సర్కిల్ వరకు మార్కెట్ జనంతో రద్దీగా కనిపించింది. వైవీ స్ట్రీట్‌లో జనం నడవడానికే ఇబ్బంది కలిగేంతగా కిక్కిరిశారు. వ్యాపారులు కూడా దుకాణాలకు వస్తున్న కొనుగోలుదారులతో సంతోషంగా కనిపించారు. పలుమార్లు ఈ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ముఖ్యంగా రెడీమేడ్ వస్త్ర దుకాణాల్లో కొనుగోలు సందడి కనిపించింది. కొన్ని ప్రముఖ దుకాణాలు, బ్రాండెడ్ దుకాణాల్లో పెద్ద ఎత్తున ప్రజలు కొనుగోలు చేశారు. రోడ్డు వారన రెడీమేడ్ వస్త్రాలు, చెప్పులు, ఫ్యాన్సీ సామగ్రి అమ్మే దుకాణాల వద్ద జనం పెద్ద సంఖ్యలో కనిపించారు. కొబ్బరికాయల దుకాణాలు కొద్దిసంఖ్యలోనే ఉండడంతో జనం వాటిని కొనేందుకు పోటీలు పడ్డారు. పండ్ల మార్కెట్, స్వీట్ దుకాణాలు కూడా రద్దీగా కనిపించాయి. మొత్తంపై పండుగ సందర్భంగా వైవీ స్ట్రీట్, మద్రాసురోడ్లలో రద్దీ జన ప్రవాహాన్ని తలపించింది.

నిర్ణీత సమయానికి స్టేడియం నిర్మాణ పనులు

ఏసీఏ సీఈఓ వెంకట శివారెడ్డి



పులివెందులలో క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏసీఏ సీఈఓ వెంకటశివారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్: పులివెందులలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఏసీఏ సీఈఓ వెంకట శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందులలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందుల క్రికెట్ క్రీడాకారుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రికెట్ స్టేడియం నిర్మించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే గ్రౌండ్ నిర్మాణం పూర్తయిందని.. పచ్చిక పనులు చేపడుతున్నామన్నారు. స్టేడియం నిర్మాణం పూర్తయితే పులివెందుల నియోజకవర్గంతోపాటు సత్యసాయి, అనంతపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు క్రీడాకారులకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వీరభద్రారెడ్డి, జిల్లా అసోసియేషన్ అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ స్టాంపుల విక్రయాలపై తనిఖీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం పాత రిమ్స్‌లో స్టాంప్ వెండర్స్ రిజిస్ట్రేషన్ స్టాంపులను అధిక మొత్తానికి అమ్ముతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వారు జరిపిన తనిఖీల్లో వివిధ స్టాంపులను అధిక మొత్తానికి అమ్ముతున్నట్లు కనుగొని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెడ్డెప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గండి అంజన్న సన్నిధిలో వ్యవసాయశాఖ సెక్రటరీ



ఆలయంలో హారతి తీసుకుంటున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ సెక్రటరీ రామారావు

చక్రాయపేట : గండిక్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామిని గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ సెక్రటరీ రామారావు దర్శించుకున్నారు.ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందా రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన,ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్, రాజగోపాలాచార్యులు ఆయనతో పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఆలయ చరిత్ర గురించి వినిపించారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్రప్రసాద్ ఆయనకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

లక్ష్మీ చెన్నకేశవస్వామికి రూ 3,17,630 ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో శాశ్వత హుండీల ద్వారా స్వామి వారికి రూ 3,17,630 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. భక్తులు స్వామి వారికి కానుకల రూపంలో హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో, ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉత్సాహం.. ఉత్తేజం

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా



బాలికల విభాగంలో విన్నర్స్‌గా నిలిచిన రాయచోటి జట్టు

కడప స్పోర్ట్స్ : క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉల్లాసం, ఉత్సాహంతో పాటు ఉత్తేజం కలుగుతుందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్టెప్, ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో హాకీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధ్యాన్‌చంద్ అకాడమీ డైరెక్టర్ సుభాన్‌బాషా మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో రాయచోటి జట్టు విన్నర్స్‌గా, కడప జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలుర అండర్–14 విభాగంలో రాయచోటి జట్టు విన్నర్స్‌గా, కడప జట్టు రన్నరప్‌గా నిలిచింది. సీనియర్స్ విభాగంలో కడప జట్టు విజేతగా, రాయచోటి రన్నరప్‌గా నిలిచింది. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఒలంపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు తోటకృష్ణ, కార్పొరేటర్లు ఎస్‌ఎండీ షఫీ, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, హాకీ కోచ్ కల్యాణ్‌కుమార్, శౌరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి నేచురల్ గ్యాస్

- డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- కడపలో మొదటి ఎల్‌సీఎన్‌జీ స్టేషన్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్(వైఎస్సార్‌జిల్లా) : ఏజీ అండ్ పీ ప్రథమ్ కడపలో ఏర్పాటు చేసిన మొదటి లిక్విఫైడ్ అండ్ కంప్రెష్డ్ నేచురల్ గ్యాస్(ఎల్‌సీఎన్‌జీ) స్టేషన్‌ను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక సెంట్రల్ జైలు సమీపంలోని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఏరియాలో ఏర్పాటు చేసిన స్టేషన్‌ను వారు ప్రారంభించి,. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే ఇలాంటి ప్రాజెక్టులు రావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, వాణిజ్య గృహ సముదాయాలకు సహజ వాయువు అందించేందుకు ఏజీ అండ్ పీ ప్రథమ్ ప్రోత్సాహం అందిస్తోందన్నారు. త్వరలోనే కడప వాసులకు నేచురల్ గ్యాస్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మొట్ట మొదటి ఎల్‌సీఎన్‌జీ స్టేషన్ కడపలో ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. నేచురల్ గ్యాస్ ఎల్‌పీజీ గ్యాస్ కంటే తక్కువ భారం కలిగి ఉంటుందని,దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం కూడా తక్కువేనన్నారు. సీఎన్‌జీ వాహనాలు ప్రజలకు ఆర్థికలాభాన్ని చేకూరుస్తాయన్నారు. మైలేజీ కూడా ఎక్కువ ఇస్తాయన్నారు. ఎలాంటి హానికరమైన ఉద్గారాలను విడుదల చేయనందు వల్ల ఇది పర్యావరణానికి కూడా మేలు చేస్తుందన్నారు. కాకినాడలో వీరికి ఒక స్టేషన్ ఉందని,అనంతపురం రాప్తాడులో మరొకటి ఏర్పాటు చేయబోతున్నారన్నారు.

ఏజీ అండ్ పీ ప్రథమ్ మేనేజింగ్ డైరెక్టర్ అభిలేష్ గుప్తా మాట్లాడుతూ రోజుకు 100 టన్నుల సహజ వాయువు సరఫరా సామర్థ్యంతో నిర్మితమైన ఈ స్టేషన్ కడప, అన్నమయ్య జిల్లాల అవసరాలు తీర్చగలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఓఓ చిరదీప్ దత్తా, క్లస్టర్ హెడ్ జీఏ వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అఫ్జల్‌ఖాన్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్, వీరారెడ్డి పాల్గొన్నారు.

• అయ్యో పాపం



స్థానిక గంగమ్మ దేవాలయం ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. మృత దేహం వద్ద మూడేళ్ల బాలుడు నిలుచుని ఉన్నాడు. వీరిద్దరు ఎవరో ఆచూకీ లభించలేదు. మృతుడు స్థానికంగా బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు, మూడేళ్ల బాలుడు అతని కుమారుడని స్థానికులు చెబుతున్నారు. మృతదేహం వద్ద ఉన్న బాలుడిని చూసిన స్థానికులు పోలీసులకు,గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు.మృత దేహానికి పంచనామా నిర్వహించి పంచాయతీకి అప్పజెప్పారు. మృతునికి సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని, ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. అనాథగా మిగిలిన బాలుడిని స్థానిక ఐసీడీఎస్ అధికారులకు అప్పజెప్పినట్లు ఎస్‌ఐ చెప్పారు. – ముద్దనూరు

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్

కడప సెవెన్‌రోడ్స్ : సంక్రాంతి సందర్భంగా సీసీ బస్ ట్రావెల్స్ వారు ఆర్టీసీ నిర్దేశించిన ప్రకారమే ప్రయాణికుల నుంచి ట్రావెల్ చార్జీలు వసూలు చేయాలని, అలా కాకుండా ఎవరైనా అధిక చార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ తెలిపారు. గురువారం డీటీసీ కార్యాలయంలో సీసీ బస్ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందన్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని అధిక చార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రత్యేక తనిఖీ బృందాలతో సీసీ బస్సుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 19 కేసులు నమోదు చేసి జరిమాన విధించామని పేర్కొన్నారు. సీసీ బస్సు ఆపరేటర్లు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నామని తెలిస్తే సెల్ నంబరు 9154294226కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. రవాణా వాహన యాజమాని ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా త్రైమాసిక పన్నులు చెల్లించాలన్నారు. అలా చెల్లించకుండా వాహనాలు తిప్పడం నేరమవుతుందన్నారు. పాత త్రైమాసిక పన్ను బకాయిలు స్వచ్ఛందంగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని చెప్పారు. అలా చెల్లించని వారికి పెనాల్టీలో క్వార్టర్ మొదటి నెలలో 15 శాతం, రెండో నెలలో 25 శాతం , మూడో నెలలో 50 శాతం రాయితీ ఉంటుందని వివరించారు. అలా కాకుండా తనిఖీల్లో పట్టుబడే వాహనాలకు పెనాల్టీ వరుసగా 50, 100, 200 శాతం విధిస్తామని హెచ్చరించారు. పన్నులు చెల్లించని వాహనాలపై కేసులు నమోదు చేసేందుకు మండలాల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు 31 వరకు జిల్లా రవాణాశాఖకు ప్రభుత్వం నిర్దేశించిన ఆర్థిక లక్ష్యం రూ. 219.38కోట్లు కాగా, రూ.133.89 కోట్లు వసూలు చేశామన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్ కొనసాగుతారు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా సీవీ ప్రసాద్ కొనసాగుతారని రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు తెలిపారు. ఏప్రిల్ నెలలో జిల్లా కౌన్సిలర్లు ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. గురువారం కడపలోని జిల్లా కార్యాలయంలో విలేకరులతో శేఖర్‌బాబు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిని సంఘం నుంచి తొలగించాలని కొంతమంది ప్రకటన చేశారన్నారు. ఇది రాష్ట్రశాఖ ఇచ్చిన సర్క్యులర్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నందున జిల్లా కమిటీ తిరస్కరిస్తోందని తెలిపారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఈశ్వరచంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యపద్ధతిలో ఎన్నికైన ప్రసాద్‌ను తొలగిస్తున్నట్లు రాష్ట్రశాఖ ప్రకటన విడుదల చేయడం అన్యాయమన్నారు.దీనిని ఖండిస్తున్నామన్నారు.. నవంబర్‌లో రాష్ట్రశాఖ ఉత్తర్వులు వెనక్కు పంపిస్తూ జిల్లాశాఖ ప్రసాద్‌ను ప్రధాన కార్యదర్శిగా కొనసాగిస్తున్నట్లు తీర్మానాన్ని రాష్ట్రశాఖకు తెలిపినా ఇలాంటి ప్రకటన ఇవ్వడం దారుణమనన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డి రాజగోపాల్, బిఎస్ ప్రసాద్, పద్మజలు మాట్లాడారు.

- జిల్లా కార్యకర్తలు, కమిటీ నిర్ణయం మేరకే జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నట్లు సీవీ ప్రసాద్ తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న స్టెప్ సీఈఓ

కడప స్పోర్ట్స్ : స్వామి వివేకానందుని జయంతి పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా స్టెప్/డీఎస్‌ఏ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ విచ్చేసి హాకీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానందుని మార్గాన్ని యువత అనుసరించాలన్నారు. ఆయన చెప్పిన విధంగ యువత చేతిలోనే దేశ అభివృద్ధి ఉందన్నారు. అనంతరం విజేతలకు నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, కోచ్‌లు శ్రీనివాసరాజు, కల్యాణ్‌కుమార్, సిబ్బంది నారాయణ, అబ్బాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భద్రతాచర్యలు బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీఐజీ వెంకట్రామిరెడ్డి

కడప అర్బన్ : కడప విమానాశ్రయంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీఐజీ బి. వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప విమానాశ్రయంలోని కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఐజీ మాట్లాడుతూ అక్రమంగా విమానాశ్రయంలో ప్రవేశించకుండా ప్రహరీ వెంబడి వాచ్ టవర్లు ఏర్పాటు, రాత్రిపూట లైటింగ్ చేయడంతో పాటు నిరంతరం గస్తీ తిరిగేందుకు వీలుగా ప్రహరీ రెండు వైపులా రోడ్లు , హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్పీ కేకేన్ అన్బురాజన్‌కు సూచించారు. విమానాశ్రయ భద్రతకు ఫైర్, రెవెన్యూ, ఎస్‌పీఎఫ్, జిల్లా పోలీసు అధికారులు, సమన్వయంతో విధులు నిర్వహించాలనీ డీఐజీ చెప్పారు. సమావేశంలో ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డీఎస్పీ బి. వెంకటశివారెడ్డి, చెన్నూరు ఎస్‌ఐ శ్రీనివాసుల రెడ్డి, వల్లూరు ఎస్‌ఐ విష్ణువర్ధన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా హాకీ జూనియర్ జట్టు

కడప స్పోర్ట్స్ : నంద్యాలలో ఈనెల 14 నుంచి 16వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ విభాగం హాకీ ఎంపికల్లో పాల్గొనే జిల్లా జట్లను గురువారం ప్రకటించారు. ఈ నెల 8న ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసి వారి నుంచి తుది జట్టును ఎంపిక చేసినట్లు సీనియర్ క్రీడాకారుడు ఎం.శేఖర్ తెలిపారు. సీనియర్ క్రీడాకారులు ఎ. రమేష్‌బాబు, చూడామణి, విలియం, చిన్నా, ప్రవీణ ఖాన్, దీపు, శౌరి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు : వి. వేణుమాధవరెడ్డి, ఎల్.వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎన్.పవన్‌కుమార్‌రెడ్డి, బి. సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్.ప్రశాంత్‌కుమార్, ఎస్.అబ్దుల్‌అజీజ్, ఎం.రాఘవేంద్రప్రసాద్, కుమార్‌బాబు, ఎస్.ఆఫ్రిద్, కె.నేత్రనాయుడు, టి.జగదీష్‌రాయల్, పి.అసద్‌ముస్సిన్‌ఖాన్, హేమంత్‌కుమార్, చరణ్ కుమార్, దయాసాగర్, కార్తీక్, మణికంఠగౌడ్, షఫీవుల్లా, **స్టాండ్‌బై :** పవన్‌కుమార్, పెద్దిరెడ్డయ్య, యశ్వంత్. **కోచ్ :** అనిల్‌కుమార్, మేనేజర్: శౌరికుమార్, కేర్‌టేకర్ : దివాకర్.

డీసీసీ బ్యాంకు ఉద్యోగులకు క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కడప డీసీసీబీ సీఈఓ రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. కడప డీసీసీబీ పరిధిలోని రెండు జట్లు, కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) నుంచి రెండు జట్ల మధ్య పోటీలు జరిగాయి. డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్ర కుమార్ బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కడప డీసీసీబీ నుంచి ఒక జట్టు, అన్నమయ్య పీఏసీఎస్ నుంచి మరో జట్టు విజయం సాధించాయి. ఈ రెండు జట్ల మధ్య శుక్రవారం పోటీ జరగనుంది. గెలుపొందిన వారికి ఫిబ్రవరి 8వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నారు.

కొనసాగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కడప అర్బన్ : కడప నగరంలోని పోలీస్‌పరేడ్ మైదానంలో గురువారం జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ –2023 కొనసాగింది. జిల్లాలోని 6 పోలీస్ సబ్ డివిజన్‌ల నుంచి పోలీసులు పాల్గొన్నారు. హాకీ, వాలీబాల్, కబడ్డీ, పుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, మహిళలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగంలో పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏ.ఆర్ డీఎస్పీ రమణయ్య పర్యవేక్షించారు.

22న కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రిలిమినరీ పరీక్ష

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 22న (ఆదివారం) ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి గురువారం నుంచి ఈనెల 20 వరకు అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వారు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లను వెబ్‌సైట్:ఎస్ఎల్‌పీఆర్‌బీ.ఏపీ.జీఓవి.ఇన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ పోస్టులకు సంబంధించి వైఎస్ఆర్ జిల్లాలో 22186 మంది పురుష అభ్యర్థులు, 5031 మహిళా అభ్యర్థులు మొత్తం 27,217 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఈ ప్రిలిమనరీ రాత పరీక్ష రాయనున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6100 పోస్టులకుగాను, 3,95,415 మంది పురుషులు, 1,08,071 మంది మహిళా అభ్యర్థులు, మొత్తం 5,03,486 మంది పోటీపడుతున్నారు.

బాలికల అదృశ్యం : కేసు నమోదు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలికల అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన వీరిద్దరు మధ్యాహ్న భోజన విరామ సమయంలో బయటికి వెళ్లినట్లు తెలిసింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ విద్యార్థినుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ


మధుసూదన్‌రెడ్డి


నారాయణ

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ ఎస్ఐగా గురువారం మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా విధులను నిర్వహించారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ సెల్‌లో పనిచేస్తుండగా కడప ఒన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. అలాగే కడప ఒన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న నారాయణ రిమ్స్ ఎస్ఐగా బదిలీ అయ్యి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు కృషి చేస్తామన్నారు.

బ్రిడ్జిలను నిర్మించాలి

కడప రూరల్ : కడప నగరంలో బుగ్గవంక పరీవాహక ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జిలు నిర్మించాలని వివిధ పార్టీలు, సంఘాల నేతలు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐకి చెందిన అలీఖాన్, నారాయణ, వెంకటశివ, మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి మాట్లాడారు. బుగ్గవంక పరివాహకం ప్రాంతం రవీంద్రనగర్ పాత లా కాలేజీ, గుర్రాలగడ్డ ప్రాంతాల్లో స్థానిక ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అమీర్‌బాబు, హరిప్రసాద్, మక్బూల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలుకు బస్సు యాత్ర

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 20న హిందూపురం నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుందని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు తెలిపారు. గురువారం తమ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లయినా ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్యాకేజీలు, నిధులు, ఉన్నత విద్యాసంస్థలు, కడప ఉక్కు పరిశ్రమ, ప్రత్యేక హోదా ఏపీ రాష్ట్రానికి రాలేదన్నారు. వీటిపై నిర్వహించే బస్సు యాత్రలో విద్యార్థి, యువజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, నాయకులు ఉదయ్, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నగరంలోని స్నేహాలయ నిరాశ్రయ వసతి గృహంలో ఈ సందర్భంగా కార్యకర్తలు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రధాని కాగలిగిన అన్ని అర్హతలు ప్రియాంకకు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు విష్ణుప్రీతమ్ రెడ్డి తెలిపారు. నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్‌పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య, ప్రవల్లిక, తిరుమలేష్, ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్, ప్రసన్న, సత్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ ఉత్సవం


జండా ఊరేగింపు

వల్లూరు : మండలంలోని పెద్దపుత్తలో గురువారం గ్యార్మీ ఉత్సవాన్ని ఖాదర్‌బాషా(కైటాన్) ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వారి గృహం నుంచి దప్పు వాయిద్యాలతో జండాలను గ్రామ వీధుల గుండా దస్తగిరి స్వామి దర్గా వరకు ఊరేగించారు. అనంతరం ఫాతెహా నిర్వహించి జండాలను దర్గా వద్ద కొలువు తీర్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామోత్సవంలో ఫకీర్లు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వైభవంగా ఉరుసు ఉత్సవం

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం, విశ్వవిఖ్యాత పర్యాటక ప్రాంతమైన కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో గురువారం హజరత్ దాదా ముర్షద్ అమీన్‌పీర్ సాహెబ్ వారి ఉరుసు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అలంకరించిన కలశంలో గంధంతో దర్గా గురువులు హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ స్వగృహం నుంచి ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాల మధ్య దర్గాకు చేరుకున్నారు. తర్వాత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గాలోని గురువుల మజార్‌వద్ద గంధం సమర్పించారు. ఫాతెహా నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా
- 43వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం


'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. గురువారం సాయంత్రం 43వ డివిజన్‌లోని రవీంద్రనగర్, మక్కా మసీద్ సమీపంలోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని తెలియజేశారు. ఎక్కడైనా అర్హులకు పథకాలు అందకపోతే సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సయ్యద్ రిజ్వాన్ అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, సున్నావడ్డీ, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఇంటి స్థలం ద్వారా రూ.9.38లక్షలు మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. షేక్ యూనస్ బాషా అనే వ్యక్తి మాట్లాడుతూ తన కుటుంబానికి వైఎస్సార్ చేయూత, పింఛన్ కానుక, ఇంటి స్థలం పథకాలు వర్తించాయని, ఫలితంగా రూ.9.33లక్షల లబ్ధి చేకూరిందని తెలిపారు. పేదల మేలు కోరే ఈ ప్రభుత్వమే మళ్లీ మళ్లీ రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 43వ డివిజన్ ఇన్‌చార్జి రెడ్డి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, షఫీ, మియ్యా, తోటక్రిష్ణ, పస్తం అంజి, గోపాలక్రిష్ణ, అర్జున్, సుశీలమ్మ పాల్గొన్నారు.

గదుల అద్దె పెంపు నిలుపుదల చేయాలి

కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుమలకు వచ్చే భక్తులు విడిది చేసే గదుల అద్దెలను అమాంతంగా పెంచడం సమంజసంకాదని, అద్దె పెంపును తక్షణమే నిలుపుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ వద్ద అద్దె పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చారు. అలాగే శ్రీశైలం దేవస్థాన ప్రసాదాల కోసం వాడే వస్తువుల సరఫరా కాంట్రాక్టులో జరిగే అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డి, నాయకులు లక్ష్మణరావుతోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు మునిశంకరయ్య


'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ మునిశంకరయ్య

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. మునిశంకరయ్య అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల నుంచి ఫోన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కడప, కొండాపురం, సీకే దిన్నె మండలాల నుంచి ఐదుగురు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపారు. ఇందులో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి-1, విద్యుత్ లైన్‌కు సంబంధించి-4 సమస్యలు ఉన్నాయి. వీటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఈఈ పి. సుబ్రమణ్యం, జేఈ జి.లావణ్య పాల్గొన్నారు.

డీసీసీబీ మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు


కడప డీసీసీ బ్యాంకు ఆవరణలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

కడప అగ్రికల్చర్: కడప డీసీసీ బ్యాంకు మహిళా ఉద్యోగులకు గురువారం సంక్రాంతి పండుగ, బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో డీజీఓం సుబ్బారెడ్డి, మేనేజర్లు సునిత, నరసయ్య ఈ ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతగా కో-ఆపరేటివ్ టెక్నికల్ ప్రిన్సిపాల్(సిటిఐ) ప్రిన్సిపాల్ గుర్రప్ప వ్యవహరించారు. ఇందులో హెడ్ ఆఫీస్ బ్రాంచ్ మేనేజర్ శైలజ మొదటి బహుమతి సాధించగా ఎన్‌జీవో కాలనీ బ్రాంచ్ మేనేజర్ జయలక్ష్మి ద్వితీయ బహుమతిని హెడ్ ఆఫీస్ అధికారి భారతి తృతీయ బహుమతిని పొందారు.

జామియా మసీదు ఆస్తులు వక్ఫ్‌బోర్డుకు అప్పగింత

ప్రొద్దుటూరు కల్చరల్ : జామియా మసీదును, మసీదు ఆస్తులను వక్ఫ్‌బోర్డుకు అప్పగించినట్లు జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు బేపారి బషీర్ అహ్మద్ తెలిపారు. గురువారం సాయంత్రం వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆడిటర్ షేక్ అన్వర్‌హుసేన్, షేక్ గౌస్‌బాషాలకు మసీదు ఆస్తుల పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మసీదు కమిటీ అధ్యక్షుడిని అయిన తరువాత మసీదును పునర్ నిర్మించి దశల వారీగా అభివృద్ధి చేశానన్నారు. మసీదును అధునీకరించి సెంట్రల్ ఏసీతో పాటు ఒకేసారి 2 వేల మంది ప్రార్థనలు చేసుకునేలా మసీదును నిర్మించానన్నారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయడంతో పాటు, మసీదు నిర్వహణ కోసం రూముల నిర్మించానన్నారు. 30 సంవత్సరాలుగా ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవని, ఒక సంవత్సర కాలంగా అవినీతి జరుగుతోందని కొందరు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. మసీదుకు సంబంధించి 88 రూములు, 2 స్కూల్ భవనాలు, 1 ఫంక్షన్‌హాల్, 3 ఇళ్లు, చరాస్తుల వివరాలు, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో రూ.64,47,000 సేవింగ్ పత్రాలు తదితర అన్ని పత్రాలను, అన్ని రికార్డులను వక్ఫ్‌బోర్డు అధికారులకు అందించారు. మసీదు ఆస్తులకు సంబంధించి హైకోర్టులో 67 సెంట్లు, 32 సెంట్లు స్థలానికి 2 పిటీషన్లు తుది విచారణలో ఉన్నాయన్నారు. వాటిపై వక్ఫ్ అధికారులు దృష్టిసారించి ఆ ఆస్తులు మసీదుకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

చెన్నూరు : మండలంలోని రామనపల్లి గ్రామం దళితవాడలో అట్లూరి నాగమ్మ గురువారం మృతి చెందడంతో అంబేడ్కర్ సేవా సంఘం అధ్యక్షుడు గురయ్య సంఘం తరఫున అంత్యక్రియల నిమిత్తం రూ.2 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం కార్యదర్శి పెంచలయ్య, కోశాధికారి బ్రహ్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.

జీఓ 1పై నిరసన

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబరు 1 కాపీలను ఏఐటీయూసీ నాయకులు గురువారం ఆర్టీఓ కార్యాలయం వద్ద తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. రోడ్‌షోలు, బహిరంగసభలు నిర్వహించరాదని జీఓలో పేర్కొనడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. నాగసుబ్బారెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

కడప అర్బన్ : నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయేషా అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చెందిన చిన్నచెన్నప్పపై చీటింగ్, దాడి కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు. మోచంపేటకు చెందిన ఆయేషా గతంలో జావేద్ అనే అతన్ని వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు సంతానం. అదే ప్రాంతానికి చిన్నచెన్నప్ప వస్తూ వెళుతూ వుండేవాడు. ఆయేషాతో పరిచయం పెంచుకుని, ఆమెతో సన్నిహితంగా ఉంటూ భర్తతో విడిపోయేలా చేశాడు. ఆమెను పెళ్లి చేసుకుని బాగా చూసుకుంటాననీ నమ్మబలికించాడు. ఈక్రమంలో తన భర్త నుంచి విడిపోయిన ఆయేషా, కోవెలకుంట్లలోని చిన్నచెన్నప్పవద్దకు వెళ్లింది. కానీ అప్పటికే అతనికి వివాహమైందని తెలుసుకుని మరలా కడపకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో డిసెంబర్ 18న నిందితుడైన చిన్నచెన్నప్ప కడపకు వచ్చి ఆయేషాపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కడప అర్బన్: నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం శివలింగం బీడీసర్కిల్ సమీపంలో మట్కా రాస్తున్న జాఫర్‌ఖాన్, మియా ఖాన్‌లను సీఐ హాసం తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.6470 నగదును, మట్కాస్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

డీఈఓకు యూటీఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కోర్టు పరిధిలో ఉన్నందున వర్కు అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను వాయిదా వేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం డీఈఓ కార్యాలయంలో పదోన్నతుల విల్లింగ్ తెలిపిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను తాత్కాలిక పద్ధతిలో సర్దుబాటు చేస్తూ నిర్వహించిన కౌన్సిలింగ్‌ను వ్యతిరేకించారు. ఈ విషయంమై జిల్లా కలెక్టర్ విజయరామరాజు, డీఈఓ దేవరాజులకు వినతిపత్రమిచ్చారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం నుంచి సోమవారం వరకు పలు రకాల సంబరాలు చేస్తున్నామని సంస్థ పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ వి.విజయరామరాజు, శిల్పారామం సీఈఓ శ్యామ్ సుందర్ రెడ్డి ఆదేశాల మేరకు సంక్రాంతి సందర్భంగా ఏటా ఉత్సవాలను నిర్వహిస్తామని, అందులో భాగంగా ఈ ఏడాది కూడా నాలుగు రోజులపాటు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు యువతులు, మహిళలకు శిల్పారామం ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పలు రకాల సంప్రదాయ నాట్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. స్థానిక మిస్పా మూవీ అధినేత పద్మాకర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 15న మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు గాలిపటాల పోటీలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఉదయం 10.00 గంటల్లోపుగా ముగ్గుల పోటీలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గాలిపటాల పోటీలో పాల్గొనే వారు 15వ తేది మధ్యాహ్నం 3.00 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు రూ.5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు బహుమతులతోపాటు మూడు గిఫ్ట్ ఓచర్లు కూడా ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 88866 52058, 91828 99167 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువత సక్రమ మార్గంలో నడవాలి

సీనియల్ సివిల్ జడ్జి ఎస్.కవిత



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప ఎడ్యుకేషన్ : యువత మద్యం, మత్తుకు బానిసలు కాకుండా సక్రమమైన మార్గంలో నడుచుకుని లక్ష్యాలను సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో నెహ్రూ యువ కేంద్రం వారు ఏర్పాటు చేసిన జాతీయ యువ దినోత్సవం కార్యక్రమానికి జడ్జి కవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్టెప్‌సీఈఓ సాయిగ్రేస్, డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ ఎన్‌వైకే మణికంఠ, విజేత మహిళా మండలి అధ్యక్షులు అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకంలో చెరువులకు సాగునీరు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఎత్తిపోతల పథకం మ్యాపును పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ముద్దనూరు : వామికొండ జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ముద్దనూరు మండలంలోని 6 చెరువులకు సాగునీరందించి భూములను సస్యశ్యామలం చేస్తామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలూరు-ఆకుతోటపల్లె పెద్ద చెరువును గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ రూ.11 కోట్ల 96 లక్షల వ్యయంతో వామికొండ జలాశయం నుంచి పూలచెరువు, వేల్పుచెర్ల, పెనికలపాడు, ఆకుతోటపల్లె పెద్ద చెరువు, ఉప్పలూరు చిన్నచెరువు, కొలవలి చెరువులకు నీరందిస్తామని తెలిపారు. చాలాకాలంనుంచి స్థానిక రైతులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి భూగర్భజలాలు అడుగంటకుండా పెద్ద చెరువుకు నీటిసరఫరా చేయాలని కోరుతున్నారని, రైతుల కోరికమేరకు ఫిబ్రవరి నెలలో టెండర్లు పూర్తిచేసి మార్చినెలలో పనులు ప్రారంభించి 6 నెలల్లో 6 చెరువులకు సాగునీరందిస్తామని ఎంపీ తెలిపారు. ఈ పథకంతో చీనీ రైతులను ఆదుకోవడమేగాకుండా భూగర్భజలాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు ఉప్పలూరు ప్రాంత రైతులను నిర్లక్ష్యం చేశారన్నారు. జీఎస్ఎస్ఎస్ కాలువ ద్వారా నీటిని వదిలి సాగునీరు వనరులు పెరిగేలా చూస్తామని, ఇప్పటికే మండలంలోని గంగాదేవిపల్లె, మంగపట్నం చెరువుల ఎత్తిపోతల పథకాల ద్వారా నీరందించడానికి కృషిచేస్తున్నామని తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండల పరిధి దొమ్మరనంద్యాల గ్రామంలోని సచివాలయం 2 కొత్త మసీదు దగ్గర నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మైలవరం మండలంలోని గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు జమ్మలమడుగు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో జరుగనున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాల రూపకర్త సీఎం వైఎస్ జగన్


ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : రాష్ట్రంలో పేద ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల రూపకర్త సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 4, 12, 13వ మున్సిపల్ వార్డుల పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అర్హులుగా ఉండి ఎవరికైనా పథకం రాకుంటే అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పథకాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ప్రజలు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి నవరత్నాలను ప్రవేశపెట్టారు. వాటి అమలుకు వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఇంటికే పింఛన్, రేషన్ ఇస్తున్నారన్నారు. అలాగే ప్రతి 2వేల జనాభాకు సచివాలయాలు నిర్మించి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. సచివాలయాల ప్రాంగణంలోనే ఆర్‌బీకేలు నిర్మించి అన్నాదాతల ముంగిటకే రైతు సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. 31 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. ఇన్ని పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, మోహన్ రెడ్డి, నిఖిల్‌రెడ్డి, షావలి, గౌస్ మున్నా, హిదాయత్, ఇర్ఫాన్, గఫార్, లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలతో మార్గదర్శనం



స్వామి వివేకానందుని జయంతి వేడుకల్లో పాల్గొన్న రామకృష్ణ మిషన్ స్వామిజీలు


వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో స్వామి వివేకానందునికి నివాళి



స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప కల్చరల్ : స్వామి వివేకానందుని బోధనలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని రామకృష్ణ మిషన్ కడపశాఖ కార్యదర్శి స్వామి భీతిహారానంద అన్నారు. స్థానిక రిమ్స్ వద్దగల రామకృష్ణ మిషన్‌లో బుధవారం స్వామి వివేకానందుని 160వ జయంతి సందర్భంగా యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షులు స్వామి భీతిహారానంద మాట్లాడుతూ వివేకానందుని బోధనలు యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని, ఆయన రచనలు సమాజంలో ఎందరిలోనో స్ఫూర్తి నింపాయన్నారు. మిషన్ సహా కార్యదర్శి స్వామి సన్నివాశానంద, యోగి వేమన విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు వర్మ మాట్లాడారు. అనంతరం ఎంపిక చేసుకున్న పలు కళాశాలల్లోని పేద విద్యార్థులకు రామకృష్ణ మిషన్ రూ.5 లక్షల ఉపకార వేతనాలను అందజేసింది. వివేకానంద విద్యానికేతన్ హైస్కూలు బాలలు ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను అలరించారు. కొత్తగా నిర్మించిన స్కేటింగ్ మైదానాన్ని వైవీయూ పీడీ రామసుబ్బారెడ్డి, రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి భీతిహారానంద ప్రారంభించారు. మిషన్ ప్రతినిధి శివరామిరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

దత్తత గ్రామంలో 'వివేకా' జయంతి

స్థానిక బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత తీసుకున్న నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాల గ్రామంలో గురువారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక ప్రముఖులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ కీర్తిని పాశ్చాత్య దేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానందుడు మహనీయుడని, నేటి యువతకు ఆదర్శనీయమని కొనియాడారు. సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీ రావు మాట్లాడారు.

వివేకానందనగర్‌లో..

కడప నగరం వివేకానందనగర్‌లోగల ఫోకస్ పాఠశాలలో స్వామి వివేకానందుని జయంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వివేకానందుని చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. వివేకానందనగర్ రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి బాల యల్లారెడ్డి కూడా వివేకానందునికి నివాళులర్పించారు.

విద్యాసంస్థల్లో వివేకానందుని జయంతి

వైవీయూ : కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో స్వామి వివేకానందుని జయంతి పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కడప నగర పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్వామి వివేకానందుని చిత్రపటానికి డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ వివేకానందుని మార్గంలో యువత నడవాలని సూచించారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో..

నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యువజన దినోత్సవ వేడుకలకు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వివేకానందుని గురించి వివరించారు.

యువతరానికి స్ఫూర్తి స్వామి వివేకానంద

కడప ఎడ్యుకేషన్ : భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానందను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన యువజనోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి యువకులు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి, సుబ్రమణ్యంరాజు, గురుకుమార్, ఇలియాస్‌బాష, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మహబూబ్ బాషా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ఆర్ఎంలో..

కడప నగరంలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ యూత్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వివేకానంద 160వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూల్ పుల్లయ ఫౌండర్ కాలేజ్ అధినేత పుల్లయ్య హాజరై మాట్లాడారు. ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి, బాలవికాస్ స్కూల్ కరస్పాండెంట్ గంగయ్య, ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం స్ఫూర్తిదాయకం

కడప ఎడ్యుకేషన్ : నేటి యువతకు స్వామి వివేకానందుని జీవితం స్ఫూర్తిదాయకమని కడప, అన్నమయ్య లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రంగనాథ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప వినాయకనగర్ కూడలిలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్జేయూపీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి గౌరీశంకర్, క్లబ్ ప్రతినిధులు కొండారెడ్డి, పవన్‌కుమార్, జ్ఞానేశ్వర్, రాయలసీమ టూరిజం అండ్ కల్చర్ అసోసియేషన్ కార్యదర్శి కొండూరు జనార్దన్ రాజు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పుల్లయ్య, కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

> దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ


పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో

స్క్రీన్: 1.85 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ పవర్: డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ ధర: ₹ 2,699

డి అల్ట్రా

స్క్రీన్: 1.78 అంగుళాలు బ్యాటరీ: 270 ఎంఏహెచ్ రిజల్యూషన్: 368×448 పిక్సెల్స్ బ్యాటరీ: 270 ఎంఏహెచ్ మోడ్స్: 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) కలర్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమొరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి - బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్'' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్


● అభిరామ్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్స్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.